
TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 206 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శుక్రవారం.20.02.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD




# కేంద్రం నిధులు ఎప్పుడొస్తాయి?




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) ముగింపు దశకు వచ్చింది. ఈనెల ఒకటిన వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) బడ్జెట్‌ను కూడా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ గ్రాంట్ల కింద తెలంగాణకు రావాల్సిన నిధులు రూ.22,782.50 కోట్లు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జనవరి నాటికి కేవలం రూ.4,213.29 (18.49 శాతం) కోట్లు మాత్రమే ఇవ్వడం గమనార్హం. ఈ వివరాలను కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) నివేదికలో పేర్కొంది. కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్లు ఇంకా రూ.18,569.21 (81.51 శాతం) కోట్లు ఉన్నాయి.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా 40 రోజులే గడువు ఉంది. ఈలోపు కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాల్సిన రూ.18,569.21 కోట్లను విడుదల చేస్తుందా?అంటే అలాంటి అవకాశమే లేదని ఆర్థికశాఖ అధికారులు చెప్తున్నారు. దీనికి గత ఆర్థిక సంవత్సర నిధుల విడుదలను ఉదాహరణగా చూపుతున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.21.636.15 కోట్లు రావల్సి ఉండగా, రూ. 5,451.85 కోట్లు (23.93 శాతం) మాత్రమే విడుదల చేశారు. మరోవైపు కేంద్ర పన్నుల్లో రాష్ట్రవాటాగా రూ.21,19 5.18 కోట్లు రావాలి. ఆ సొమ్ములో కూడా ఇప్పటి వరకు రూ.16,496.76 కోట్లు (77.83 శాతం) మాత్రమే ఇచ్చారు. ఇంకా రూ.4,698.42 కోట్లు రావల్సి ఉంది.

ప్రేక్షకపాత్రలో కేంద్రమంత్రులు బండి, కిషన్‌రెడ్డి డమ్మీలుగా బీజేపీ ఎంపీలు

రాష్ట్రానికి కేంద్రం నుంచి చట్ట ప్రకారం రావల్సిన నిధులను రాబట్టడంలో కేంద్రమంత్రులు జీ కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ ప్రేక్షకపాత్రకే పరిమితమవుతున్నారు. ఏదశలోనూ కేంద్రంపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేయట్లేదు. పైగా కేంద్రం నుంచి రాష్ట్రానికి వేలకోట్ల నిధులు వస్తున్నాయంటూ ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రచారానికి వచ్చిన కేంద్ర మంత్రులు రాష్ట్రానికి పెద్ద మొత్తంలో నిధులు ఇచ్చామంటూ ప్రచారం చేసుకున్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగానే స్పందించారు. 15వ ఆర్థికసంఘం నుంచి గ్రామపంచాయతీలకు దాదాపు రూ.3వేల కోట్లు రావల్సి ఉండగా, ఇటీవల రూ.259.36 కోట్ల నిధుల్ని మాత్రమే విడుదల చేశారు.

దీనికే కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ భారీ ప్రకటనలు విడుదల చేశారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న సమయంలో మిగిలిన రూ.2,740 కోట్లు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించే ధైర్యం మాత్రం ఇద్దరు మంత్రులు చేయలేదు. రాష్ట్రం నుంచి బీజేపీకి 8 మంది ఎంపీలు ఉన్నారు. వీరిలో ఇద్దరు కేంద్రమంత్రులు కాగా, మిగిలిన ఆరుగురు ఎంపీలు రాష్ట్రానికి రావల్సిన నిధుల గురించి కేంద్రాన్ని అడిగిన దాఖలాలే లేవు. ఇప్పుడు కూడా కేంద్రం నుంచి రావల్సిన రూ.18,569.21 కోట్ల గురించి కూడా ప్రస్తావించకపోవడం గమనార్హం. కేంద్రం చూపుతున్న ఈ ఆర్థిక వివక్ష రాష్ట్ర బడ్జెట్‌పై తీవ్రంగా పడుతోంది. అనేక సంక్షేమ కార్యక్రమాలకు నిధుల కటకట ఏర్పడుతున్నది.

ప్రతిపక్షపాలిత రాష్ట్రాల్లోనూ ఇదే వివక్ష

కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షపాలిత రాష్ట్రాలన్నింటిపై ఇదే తరహా ఆర్థిక వివక్షను ప్రదర్శిస్తున్నది. 'కాగ్' ఈ విషయాన్ని తన నివేదికలో స్పష్టంగా ఎత్తిచూపింది. పశ్చిమబెంగాల్‌కు గ్రాంట్ల కింద రూ.37,157.57 కోట్లు రావల్సి ఉండగా, రూ.8,313.56 (22.37 శాతం) కోట్లు, కేరళకు రూ.13,074.90 కోట్లు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.3,675.73 (28.11 శాతం) కోట్లు విడుదల చేసింది. తమిళనాడుకు గ్రాంట్ల కింద రూ.23,834.11 కోట్లు రావాల్సి ఉండగా, రూ.12,785.62 (53.64 శాతం) కోట్లు మాత్రమే ఇచ్చారని 'కాగ్' తెలిపింది.

కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఇలాంటి చర్యల వల్లే దక్షిణాది రాష్ట్రాల్లో 'పెడరలిజం', నిధులు, సమానకేటాయింపులు వంటి అంశాలపై తీవ్రస్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. కేంద్రం ఇప్పటికైనా తన తీరును మార్చుకోవాలి. దీనిపై ఆయా రాష్ట్రాల నుంచి బీజేపీ ఎంపీలు, కేంద్రమంత్రులుగా ప్రాతినిధ్యం వహిస్తున్న వారు కేంద్ర ప్రభుత్వంపై కచ్చితంగా ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉన్నదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మహిళలకు త్వరలోనే స్మార్ట్ కార్డులు!




హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఫ్రీ బస్సుకు సంబంధించి ప్రతి మహిళకు 'మహాలక్ష్మి' స్మార్ట్ కార్డులను ఇచ్చేందుకు ఆర్టీసీ కసరత్తు చేస్తోంది. ఈ చిప్ బేస్డ్ కార్డులను టికెట్ మెషీన్‌పై ట్యాప్ చేస్తే టికెట్ జనరేట్ అవుతుందని అధికారులు తెలిపారు. వచ్చే నెల నుంచి వీటిని జారీ చేయనున్నట్లు సమాచారం. పైలట్ ప్రాజెక్టుగా పలు మండలాల్లో కార్డులు జారీ చేసి తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తారని తెలుస్తోంది.

# కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్



చర్ల :అమృత్ తెలంగాణ: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కర్రెగుట్టల దండకారణ్యంలో మళ్లీ భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాల కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం. మావోయిస్టు అగ్రనేత, ఆ పార్టీ కార్యదర్శి దేవ్‌జీ లక్ష్యంగా కర్రెగుట్టల అటవీప్రాంతంలో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. కర్రెగుట్టల్లో తలదాచుకున్న మావోయిస్టులు.. ఈ విషయాన్ని గమనించి భద్రతా బలగాలపైకి కాల్పులు జరిపారు. భద్రతా బలగాలు సైతం ఎదురుకాల్పులకు దిగాయి. ఇరువైపులా నుంచి హోరాహోరీగా గంటల వ్యవధి కాల్పులు జరిగాయి. కాల్పుల అనంతరం ఆ ప్రాంతంలో ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు గుర్తించినట్లు తెలిసింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. మృతుల్లో అగ్రనేతలు ఉండవచ్చని భద్రతా దళాలు భావిస్తున్నాయి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సౌత్ జోన్ నుంచి కర్రెగుట్టల్లోకి మావోయిస్టులు ప్రవేశించి తల దాచుకుంటున్నట్టు నిఘా వర్గాలకు సమాచారం అందింది.

ఈ నేపథ్యంలో నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా బలగాలు ఈ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టాయి. మరోవైపు దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం రెండు సంవత్సరాల క్రితం చేపట్టిన ఆపరేషన్ కగార్ గడువు ఈ మార్చి 31 వరకు ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆ లక్ష్యం దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఇప్పటికే వందలాది మంది మావోయిస్టులు మృతిచెందగా.. కేంద్ర కమిటీ సభ్యులు కేవలం దేహార్ మిశ్రా, దేవ్‌జీ, గణపతి సజీవంగా ఉన్నట్టు సమాచారం. వేలాది మంది వివిధ రాష్ట్రాల ప్రభుత్వాల ఎదుట లొంగిపోయారు. ప్రస్తుతం తెలంగాణకు చెందిన 15 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు. ఆ జాబితాలో రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, మావోయిస్టు కీలక నేత ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, పుసునూరి నరహరి అలియాస్ సంతోష్, ముప్పిడి సాంబయ్య, వార్త శేఖర్, జోడే రత్నభాయి, బడే చొక్కారావు కోసం భద్రతా బలగాలు కర్రెగుట్టలపై జల్లెడ పడుతున్నాయి. ఇక ఈ రెండేండ్లలో 588 మంది మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

# పార్టీ భేష్ పాలన శభాష్



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌పై కాంగ్రెస్ అధిష్టానం ప్రశంసల జల్లు కురిపించింది. 'తెలంగాణలో పార్టీ పనితీరు భేష్.. పాలన శభాష్...' అంటూ వారికి కితాబిచ్చింది. ఇటీవల నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపించారంటూ ఇరువురిని అభినందించింది. రాష్ట్ర స్థాయి నుంచి పట్టణ స్థాయి దాకా ప్రతీ నాయకుడు, కార్యకర్త సమిష్టిగా పని చేయటం వల్లే ఇది సాధ్యమైందంటూ పేర్కొంది. వారందరినీ ఐక్యంగా ముందుకు నడిపించిన సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమ కాంగ్రెస్‌కు మరింత జవసత్వాలను చేకూర్చిందంటూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశంసించారు.

దేశంలోని అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులతో గురువారం ఢిల్లీలో ఏఐసీసీ ప్రత్యేకంగా సమావేశమైంది. ఖర్గే, రాహుల్‌తోపాటు ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా ఈ భేటీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు వారితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, మోడీ సర్కారు వివిధ చట్టాల్లో చేస్తున్న మార్పులు, చేర్పుల గురించి ఈ సందర్భంగా అగ్రనేతలు చర్చించారు. వాటిని వ్యతిరేకిస్తూ చేపట్టాల్సిన కార్యాచరణపై సమాలోచనలు చేశారు.

ఇటీవల రాష్ట్రంలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికలు, కాంగ్రెస్ సాధించిన విజయం గురించి సీఎం రేవంత్ రెడ్డి... అగ్రనేతలకు వివరించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేండ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే ఈ విజయానికి కారణాలని ఆయన తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత వరసగా జరిగిన పార్లమెంటు, శాసనసభ ఉప ఎన్నికలు, పంచాయతీ, మున్సిపల్ ఎలక్షన్లలో పార్టీ జయకేతనం ఎగరేసిందని గుర్తు చేశారు. నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషి, మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్, తాను కలిసి అమలు చేసిన వ్యూహాలు సత్ఫలితాలనిచ్చాయని చెప్పుకొచ్చారు. తద్వారా తెలంగాణలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చి, తిరుగులేని శక్తిగా మలిచామని పేర్కొన్నారు. ముమ్ముందు నిర్వహించబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో సైతం ఇవే ఫలితాలు పునరావృతమవుతాయంటూ సీఎం ఏఐసీసీ పెద్దలకు హామీ నిచ్చారు. ఆ మేరకు ఇప్పటి నుంచే కృషి చేస్తున్నామని ఆయన వివరించారు.

గతంలో బీఆర్ఎస్‌పై వ్యతిరేకత వల్ల అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలించిందని వాదిస్తున్న వారికి.. ఈ ఫలితాలు చెంపపెట్టు లాంటివని ఖర్గే వ్యాఖ్యానించినట్టు తెలిసింది. క్షేత్రస్థాయిలో పార్టీ బలంగా ఉంది కాబట్టే...లోకల్ బాడీ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించామంటూ ఆయన విశ్లేషించారు. సంక్షేమ పథకాలే కాంగ్రెస్‌కు అసలైన ఆయుధాలని, అందువల్ల వాటి అమల్లో రాజీపడొద్దని ఖర్గే సూచించారు. రాష్ట్రంలో పార్టీ, ప్రభుత్వ పని తీరుపట్ల కాంగ్రెస్ అగ్రనేతలు ఈ సందర్భంగా సంతృప్తిని వ్యక్తం చేసినట్టు సమాచారం. అయితే ఇక్కడితో ఆగిపోవద్దని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పటిష్టమైన ప్రణాళికలతో ముందుకు పోవాలని వారు రాష్ట్ర నేతలకు మార్గదర్శనం చేశారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన వివిధ పథకాలు, కార్యక్రమాల పురోగతి గురించి వారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీటి అమలు తీరుపై ప్రజాభిప్రాయం ఎలా ఉందంటూ రాహుల్ గాంధీ... సీఎం, డిప్యూటీ సీఎంలను ఆరా తీశారు. రాష్ట్రంలో వరి సాగు, ధాన్యం కొనుగోళ్ల గురించి ఖర్గే వివరాలు అడిగారు. తెలంగాణలో ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహిస్తున్నట్టు మంత్రి

తుమ్మల ఆయనకు వివరించారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలను ముందు నిర్వహించాలా? లేక జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎలక్షన్లను ముందు నిర్వహించాలా? అనే విషయమ్మై సమావేశంలో చర్చించినట్టు తెలిసింది. దీనిపై క్యాబినెట్‌లో చర్చించి, నిర్ణయం తీసుకోవాలంటూ ఖర్గే, రాహుల్ గాంధీ... రేవంత్ రెడ్డికి సూచించినట్టు సమాచారం.

'రాజ్యసభ'పై చర్చ...

కాగా రాష్ట్రంలో త్వరలో ఖాళీ కానున్న రెండు రాజ్యసభ స్థానాల భర్తీ గురించి సీఎం, డిప్యూటీ సీఎం, పీసీసీ చీఫ్... ఖర్గే, రాహుల్‌తో చర్చించినట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

# ఏఐ అందరికీ ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలి




న్యూఢిల్లీ : అమృత్ తెలంగాణ: కృత్రిమ మేధ (ఎఐ) అందరికీ ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలని ప్రధాని మోడీ అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ సమ్మిట్‌లో గురువారం మోడీ మాట్లాడుతూ.. 'ప్రపంచంలోని అత్యంత చారిత్రాత్మక ఏఐ సమ్మిట్‌కు మీ అందరికీ నా స్వాగతం. ప్రపంచంలోనే అతిపెద్ద టెక్ పూల్‌కు భారతదేశం కేంద్రం. భారత్‌లో ఏఐ సమ్మిట్ నిర్వహించడం గ్లోబల్ సౌత్‌కు గర్వకారణం. సిగ్నల్స్‌ను మొదట వైర్‌లెస్‌గా ప్రసారం చేసినప్పుడు ఒకరోజు మొత్తం ప్రపంచం రియల్ టైమ్‌కి అనుసంధానించబడి ఉంటుందని ఎవరూ ఊహించలేదు.

కృత్రిమ మేధస్సు అనేది మానవ చరిత్ర యొక్క ఒక పరవర్తన. ఈరోజు మనం చూస్తున్నది, మనం అంచనా వేస్తున్నది దాని ప్రభావానికి ప్రారంభం మాత్రమే అని ఆయన అన్నారు. భారత్ ఏఐని ప్రయోజనకర రీతిలో చూస్తుంది. అందుకే మేము 'సర్వజన్ హితయే, సర్వజన్ సుఖయే'ను థీమ్‌గా ఎంచుకున్నాం. అందరికీ, ముఖ్యంగా గ్లోబల్ సౌత్‌కు ప్రజాస్వామ్యబద్ధగా ఉండటానికి మనకు ఏఐ అవసరం అని అన్నారు. అలాగే ఎఐ యంత్రాలను తెలివైనవిగా మారుస్తోంది. కానీ అంతకంటే ఎక్కువగా ఇది మానవ సామర్థ్యాలను అనేక రెట్లు పెంచుతోంది అని మోడీ అన్నారు. 'ఏఐ రంగంలో భారత్ కీలక పాత్ర'– సమ్మిట్‌లో యూఎన్ చీఫ్, టెక్ దిగ్గజాల ప్రసంగం

ఏఐ భవిష్యత్‌ను కొందరు నిర్ణయించలేరు: యూఎన్ చీఫ్

గ్లోబల్ సౌత్‌లో మొదటి ఏఐ సమ్మిట్‌ను నిర్వహిస్తున్న భారత్‌కు యూఎన్ సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ అభినందనలు తెలియజేశారు. భారత్‌లో జరిగే ఈ ఏఐ సమ్మిట్‌కు ప్రత్యేక అర్థం ఉందని చెప్పారు. ఏఐ భవిష్యత్తును కొన్ని దేశాలు లేదా కొంత మంది బిలియనీర్లు నిర్ణయించలేరని స్పష్టం చేశారు. నిజమైన ఇంపాక్ట్ అంటే జీవితాలను మెరుగుపరిచి, భూమిని రక్షించే సాంకేతికత అని అభిప్రాయపడ్డారు.

దేశంలో మార్పుల వేగాన్ని చూసి ఆశ్చర్యపోతున్నా : సుందర్ పిచాయ్

తాను భారత్‌ను సందర్శించిన ప్రతిసారీ దేశంలో మార్పుల వేగాన్ని చూసి ఆశ్చర్యపోతున్నానని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ స్పష్టం చేశారు. తాను విద్యార్థిగా ఉన్నప్పుడు చెన్నై నుంచి ఐఐటీ ఖరగ్‌పూర్‌కు కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ మీదుగా వెళ్లేవాడిని తెలిపారు. ఇప్పుడు తీరప్రాంత నగరమైన అదే విశాఖపట్నంలో గూగుల్ ఫుల్ స్టాక్ ఏఐ హబ్ ఏర్పాటు చేస్తోందని వెల్లడించారు. ఈ హబ్ గిగా వాట్ స్కేల్ కంప్యూటర్, కొత్త అంతర్జాతీయ సబ్‌సీ కేబుల్ గేట్‌వేను కలిగి ఉ ంటుందని అన్నారు. దీని వల్ల యువతకు ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే భారత ప్రజలకు అత్యాధునిక ఏఐ అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

ప్రతి పౌరుడికి ఏఐని అందించడమే లక్ష్యం : టాటా సన్స్ చైర్మెమన్ చంద్రశేఖరన్

ప్రజలపై ఏఐ చాలా బలమైన ప్రభావాన్ని చూపుతుందని టాటా సన్స్ చైర్మెన్ ఎన్ చంద్రశేఖరన్ అభిప్రాయపడ్డారు. సమాజంపై తీవ్ర ప్రభావం చూపే తదుపరి ప్రధాన మౌలిక సదుపాయం ఏఐయేనని స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి పౌరుడికి ఏఐ టూల్స్ అందేలా చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్యక్రమాలకు భారత్ సాక్షిగా నిలుస్తోందన్నారు.

ఏఐతో అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయి : ఆంత్రోపిక్ సీఈఓ

ఏఐ రంగంలో భారత్ కీలక పాత్ర పోషించనుందని ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ అభిప్రాయపడ్డారు.

# గ్రంథాలయాలను విస్మరిస్తే విజ్ఞానానికి మూలాలే క్షీణిస్తాయి.

ఇవి జ్ఞాన భాండాగారాలుగా, సమాజంలో అవగాహనను పెంచుతూ యువతకు మార్గదర్శకాలుగా నిలుస్తాయి. గ్రంథాలయాల పాత్రగ్రంథాలయాలు విజ్ఞానాన్ని సమాజానికి అందించే కీలక కేంద్రాలు. స్వాతంత్ర్యోద్యమం నుంచి నేటి వరకు ప్రజల్లో జాగృతి, పోటీపరీక్షా సిద్ధతకు ఇవి దోహదపడుతున్నాయి. డిజిటల్ యుగంలో కూడా పుస్తక సంపద ద్వారా నైపుణ్యాలు పెంచుకోవడానికి ఇవి అవసరం. సవాళు ప్రస్తుతం గ్రంథాలయాలు మౌలిక సదుపాయాలు, పుస్తకాల కొరత, సిబ్బంది లేకపోవడంతో కుంటున్నాయి. ఆర్థిక నిధులు సరిగా కేటాయించకపోవడం, పాఠకుల నిర్లక్ష్యం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో చాలా మూతపడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో సెస్ పన్ను ఉన్నప్పటికీ, దాన్ని సమర్థవంతంగా ఉపయోగించకపోవడం శోచనీయం. పరిష్కారాలుప్రభుత్వాలు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి, CSR నిధులు కేటాయించాలి. డిజిటల్ గ్రంథాలయాలు, ఆధునిక పుస్తకాలు జోడించి పాఠకులను ఆకర్షించాలి. యువతను ప్రోత్సహించడం వల్ల సమాజ అభివృద్ధికి ఇది మార్గం..

గ్రంథాలయాలు సమాచార యుగంలో జ్ఞానాన్ని ఎవరైనా, ఎక్కడి నుంచైనా సులభంగా పొందేలా చేస్తాయి. తెలుగు సహా భారతీయ భాషల్లో కోట్లాది పుస్తకాలు అందుబాటులో ఉండటం వాటి ప్రత్యేకత. ప్రధాన ప్రయోజనాలుఖరీదైన పుస్తకాలు కొనాల్సిన అవసరం లేకుండా, మొబైల్ లేదా కంప్యూటర్ ద్వారా డౌన్‌లోడ్ చేసి చదవవచ్చు. పరిశోధకులు, విద్యార్థులు తమ చోటే ఏదైనా సమాచారం శోధించి పొందుతారు; పోటీపరీక్షలు, కెరీర్ గైడెన్స్‌కు ఉపయోగపడతాయి. కరోనా వంటి సంక్షోభాల్లో గ్రంథాలయాలు మూతపడినా, డిజిటల్ యాక్సెస్ విజ్ఞానాన్ని అందించింది. తెలంగాణలో చిహ్నాలుతెలంగాణలో వికారాబాద్, కామరెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ డిజిటల్ పబ్లిక్ లైబ్రరీలు (IDPL) ద్వారా వేలాది మంది యువతకు ICT శిక్షణ, కెరీర్ గైడెన్స్ లభించింది. జాతీయ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా (NDLI) ద్వారా 4 కోట్లకు పైగా పుస్తకాలు ఉచితంగా అందుబాటు. డిజిటల్ సామర్థ్యం పెంచడానికి లైబ్రేరియన్లకు శిక్షణలు ఇస్తున్నారు. సవాళ్లుఇంటర్నెట్ సదుపాయాలు, డిజిటల్ లిటరసీ కొరత వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పూర్తి ఉపయోగం జరగట్లేదు. లైబ్రరీలు డిజిటలైజేషన్ పాలసీలు రూపొందించి, బడ్జెట్ కేటాయించాలి.

తెలంగాణలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అధునాతన మోడల్ గ్రంథాలయాలు, పాఠశాలల్లో లైబ్రరీల ఏర్పాటు వంటి ప్రణాళికలు అమలు చేస్తోంది. ఇటీవలి ప్రణాళికలు జిల్లా స్థాయి భవనాల నిర్మాణం, రీవ్యాంప్ పై దృష్టి పెట్టాయి. ప్రధాన ప్రణాళికలుతొలిమెట్టు కార్యక్రమం కింద అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాలు ఏర్పాటు, ప్రతి లైబ్రరీకి 120o పుస్తకాలు అందించడం జరుగుతోంది. తెలంగాణ పౌర గ్రంథాలయ చట్టం 2015 ప్రకారం జిల్లా కేంద్ర గ్రంథాలయాలకు రూ. 2-4 కోట్లు ఖర్చుతో మోడల్ లైబ్రరీలు నిర్మిస్తున్నారు. కరీంనగర్‌లో 12 గుంటల స్థలం, రూ. 1.50 కోట్లతో జిల్లా గ్రంథాలయం ఏర్పాటు ప్రణాళిక ఉంది. ఇటీవలి అభివృద్ధి2026లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మా ప్రకారం, హైదరాబాద్ గ్రంథాలయాలను రీవ్యాంప్ చేసి చర్చా, ఐడియా ఎక్స్ఛేంజ్ కేంద్రాలుగా మార్చాలని ప్రణాళిక. 23 జిల్లాల్లో కొత్త భవనాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఏసీ రీడింగ్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర పౌర గ్రంథాలయ పరిషత్ పుస్తకాల సరఫరా, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్లాన్‌లు రూపొందిస్తోంది. సవాళ్లు మరియు సూచనలులైబ్రరీ సెస్ బకాయిలు చెల్లించడం, హ్యూమానిటీన్ గ్రంథాలయాల ప్రోత్సాహం అవసరం. ప్రభుత్వం డెడ్‌లైన్‌లు సెట్ చేసి పునర్జీవనం చేయాలి.


తొలిమెట్టు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటు మంచి ప్రగతి సాధించింది. 2025 నాటికి 21,519 పాఠశాలల్లో పుస్తకాల సెట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రగతి వివరాలుతొలిమెట్టు కింద 5 వేల ప్రభుత్వ పాఠశాలల్లో (ప్రాథమికోన్నత, ఉన్నత) గ్రంథాలయాలు ఏర్పాటు, ప్రతి ఒక్కటికి 120o పుస్తకాలు, మొత్తం 6 లక్షల పుస్తకాల ముద్రణ పూర్తి. ప్రతి రోజు 15 నిమిషాల రీడింగ్ తప్పనిసరి చేసి, పఠన శక్తి పెంపొందించారు. రూమ్ టు రీడ్ వంటి సంస్థలు 170 పాఠశాలల్లో 3 వారాల రీడింగ్ క్యాంపెయిన్‌లు నిర్వహించాయి. సవాళ్లుపుస్తకాలు ఉన్నప్పటికీ శాశ్వత లైబ్రేరియన్లు లేకపోవడం వల్ల నిర్వహణ సమస్యలు ఉన్నాయి. పుస్తకాలు మూలనపడే పరిస్థితి ఏర్పడుతోంది. సిబ్బంది కరవును పరిష్కరించాలి.



ఎం. సంతోష్
( ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ ).

## చత్రపతి శివాజీ మహారాజ్ మార్గంలో యువత నడవాలి బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ తన మతాన్ని కాపాడుకుంటూ, పరమత సహనంతో రాజ్యాన్ని పాలించిన లౌకిక పాలకుడు, ధీశాలి ఛత్రపతి శివాజీ మహారాజ్ ని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సుంకిడి లో ఛత్రపతి శివాజీ మహారాజ్ నూతన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్, సామజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. గ్రామస్తులు డప్పు చప్పుళ్ల నడుమ వైభవంగా విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సుపరిపాలనకు గొప్ప చిహ్నంగా శివాజీ మహారాజ్ నిలిచిపోయారని అన్నారు. శివాజీ బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడిన మహావీరుడని,స్వరాజ్య స్థాపనకు పునాది వేసిన గొప్ప యోధుడని కొనియాడారు. చిన్న వయసులోనే స్వరాజ్య స్వప్నాన్ని సాకారం చేసిన నాయకుడిగా ఆయన చరిత్రలో నవతరానికి ఒక స్ఫూర్తిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. శివాజీ మహారాజ్ అడుగుజాడల్లో యువత ముందుకు వెళుతూ,వారి ఆదర్శాలను అనుసరించాలని, సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.



నివాళులు అర్పిస్తున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి పక్కన ఆడే గజేందర్

## నేటి యువత ఛత్రపతి శివాజీ మహారాజ్ ను స్ఫూర్తిగా తీసుకోవాలి : ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి.

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ హిందూ ధర్మ రక్షకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ గారి జయంతి సందర్భంగా సారంగాపూర్ మండలం మలక్ చించొలి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శివాజీ మహారాజ్ విగ్రహాన్ని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సనాతన ధర్మం (హైందవ ధర్మ రక్షణకు) శివాజీ మహారాజ్ చేసిన సేవ చిరస్మరణీయం అన్నారు. మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన హిందూ ధర్మ రక్షకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ ను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, ముత్యం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, మండల అధ్యక్షులు నరేష్, నాయకులు అంబటి గంగాధర్, మాజీ ఎంపీటీసీ కొరిపెల్లి రాజేశ్వర్ రెడ్డి, తో పాటు మండల బీజేపీ సీనియర్ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



చిత్రపతి శివాజీ మహారాజ్ కు పూలు వేస్తున్న నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి

## శివాలయంలో అభిషేకంలో స్థానిక సర్పంచ్ మల్లేష్ పటేల్ తో కలిసి పాల్గొన్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్





అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ : నేరడిగొండ మండలంలోని లింగాట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని గోండుగూడ గ్రామంలోని శివాలయంలో నిర్వహించిన ప్రత్యేక అభిషేక కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆడే గజేందర్ స్వామివారికి అభిషేకం చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుభిక్షం కలగాలని కోరుకున్నారు అనంతరం గ్రామస్థులతో కలిసి మాట్లాడిన ఆయన, గ్రామ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని తెలిపారు. భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఈ కార్యక్రమంలో లింగాట్ల సర్పంచ్ మల్లేష్ పటేల్, బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ తిత్రే నారాయణ్ సింగ్ మాజీ ఎంపీపీ ప్రేమ్ సింగ్,నాయకులు కమల్ సింగ్,మాజీ సర్పంచ్ ఆత్రం నాగేష్, సాబ్లే కైలాష్, ఆత్మ డైరెక్టర్ అందు సింగ్,ఇందల్ , సర్దార్, దేవి సింగ్,మాజీ ఛైర్మన్ మందుల రమేష్,మురళి గౌడ్, కపిల్ దేవ్,యండి సద్దాం, ఈశ్వర్, తదితరులు ఉన్నారు

## మాజీ మంత్రి జోగు రామన్న ఆశీస్సులు అందుకున్న నూతన మున్సిపల్ చైర్మన్



మాజీ మంత్రి జోగురామన్న దంపతులను కలిసిన మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్ దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్: పట్టణ అభివృద్ధి ధ్యేయంగా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నూతనంగా ఎన్నికైన ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్ మాజీ మంత్రి వర్యులు జోగు రామన్న నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

నూతన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా, అనూష సతీష్ జోగు రామన్న రమాబాయి దంపతులకు నమస్కరించి, వారి ఆశీస్సులు అందుకున్నారు.

కౌన్సిలర్లకు సన్మానం: ఈ సందర్భంగా దీ=ా పార్టీ తరపున విజయం సాధించిన కౌన్సిలర్లను జోగు రామన్న తన నివాసానికి ఆహ్వానించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారి విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

రాబోయే ఐదేళ్ల కాలంలో చైర్మన్ మరియు కౌన్సిలర్లు అందరూ కలిసికట్టుగా పని చేయాలని రామన్న సూచించారు. “పేద, ధనిక అనే పక్షపాతం లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలి. ప్రజల మన్ననలు పొంది, ఆదిలాబాద్ మున్సిపాలిటీని ఆదర్శంగా నిలపాలి” అని ఆయన ఆకాంక్షించారు.

నూతన పాలక మండలికి భగవంతుడు నిండు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని, ప్రజలకు సేవ చేసే శక్తిని ఇవ్వాలని కోరుకుంటూ జోగు రామన్న శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మిడ్జిల్ లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు కృషి

మిడ్జిల్ : అమృత్ తెలంగాణ:మిడ్జిల్ మండల కేంద్రంలో నర్సరీ నుండి ఇంటర్మీడియట్ వరకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తానని, ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర విద్యా కమిటీ మెంబర్ చారకొండ వెంకటేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు అనుభవాగ్నులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య ప్రభుత్వం అందిస్తుందని, విద్యా బలోపేతానికి ప్రజా ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించలేదని అన్నారు. పాఠశాలకు గేటుకు తాళం వేయడంతో పత్రికల్లో వార్తలు రావడంతో సీఎంఓ ఆదేశాల మేరకు.. ఉపాధ్యాయుల పనితీరుపై, మధ్యాహ్న భోజనం, పాఠశాలలో ఉన్న సమస్యలపై విద్యార్థుల నుండి అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు 90% ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేశంలో ఎక్కడ కూడా విద్యా కమిషన్ లేదని, తెలంగాణ రాష్ట్రంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా బలోపేతం చేయాలని ఉద్దేశంతో ఏర్పాటు చేశారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పాఠశాలలో ఉన్న సమస్యలను, ఉపాధ్యాయుల పనితీరుపై విద్యా కమిటీ పని చేస్తుందని చెప్పారు. ఎంతోమంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకొచ్చేది ఉపాధ్యాయులేనని, ఉపాధ్యాయులే సరిగా లేకుంటే విద్యార్థులను ఎలా క్రమశిక్షణ ఉంటారని ప్రశ్నించారు.



ప్రభుత్వ అందించిన మెనూ ప్రకారంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్ అయితే గ్రామీణ ప్రాంతాలలో ఉన్న సమస్యలు అర్థం చేసుకుంటారని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి ప్రవీణ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలలో పెండింగ్ లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేస్తామని వెంటనే పనులు ప్రారంభించాలని సర్పంచ్ శంకర్ కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు బాలయ్య, బుచ్చయ్య, విద్యార్థి సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి: టీచర్స్ జేఏసీ

భువనగిరి :అమృత్ తెలంగాణ: జిల్లాలోని విద్యారంగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కి వివిధ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా జిహెచ్ఎంసి పరిధి పెరిగినందున జిహెచ్ఎంసి పరిధి నుండి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు 24 శాతం హెచ్ఆర్ఏ ఇవ్వాలని, భువనగిరి మున్సిపల్ పరిధి నుండి 8 కిలోమీటర్ల పరిధిలో ఉన్నటువంటి కార్యాలయాలలో పనిచేస్తున్నా వారికి 13 శాతం



హెచ్ఆర్ఏ ఇవ్వాలని అన్నారు. కేజీబీవీ పాఠశాలలకు సరఫరా చేసే బియ్యాన్ని స్కూల్ పాయింట్ వరకు సరఫరా చేయాలని, ఫారిన్ సర్వీసులో ఉండి వారి పీరియడ్ పూర్తయిన వారిని వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. వర్క్ అడ్జస్ట్మెంట్ పేరుతో చేసినటువంటి అక్రమ సర్దుబాటులను వెనక్కి తీసుకోవాలని, అపరిష్కృతంగా ఉన్నటువంటి జిల్లాలోని విద్యారంగా ఉపాధ్యాయ సమస్యను పరిష్కరించాలని ప్రాతినిధ్యం చేయడం జరిగిందని తెలిపారు.

## యువకులు ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి



మిడ్జిల్ : అమృత్ తెలంగాణ: ఛత్రపతి శివాజీ ప్రజల కోసం చేసిన సేవలు మర్చిపోలేనివని, యువకులు ఆయనను ఆదర్శంగా తీసుకొని ఎదగాలని నాయకులు అన్నారు. ఛత్రపతి జయంతి సందర్భంగా మండల కేంద్రంతో పాటు, వాడియాల, కంచనపల్లి, రాణి పేట, వివిధ గ్రామాలలో యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. దేశం కోసం ఆయన చేసిన సేవలు గ్రామస్థాయిలోకి తీసుకెళ్లే బాధ్యత యువజన సంఘాల పైన ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘ నాయకులు, వివిధ పార్టీల పెద్దలు, రాజేశ్వర్, విజయ్ కుమార్, పల్లె తిరుపతి, నరేష్ నాయక్, కావలి నరేష్, నారాయణ, శేఖర్, విజయ్ భాస్కర్, అంజి, అరవింద్, కావలి నరేష్, శేఖర్ యువజన సంఘ నాయకులు వడ్డే నవీన్, అజయ్ ,శేఖర్, బాజీ, సిద్దు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# కల్పనలకన్నా ఈ వాస్తవమే అత్యద్భుతంగా ఉంది!

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి సత్యం ఎప్పుడూ కల్పనల కన్నా అద్భుతంగా ఉంటుంది. కొన్ని సత్యాలైతే మరీ ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. కొన్ని సంభ్రమంలో ముంచే స్థాయి -- ఉదాహరణకు గత పన్నెండేళ్లుగా మన దేశంలో చూస్తున్నాం. ఆరోపణలు, ప్రత్యారోపణలూ, కమిటీలు, కమిషన్లు, కేసులు, నివేదికలు, దాడులు సోదాలు, పూటపూటకూ ఎన్నో ట్విస్ట్‌లు.. ఉంటున్నాయి. వార్తా ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారాలు చూస్తున్న మనకు క్షణక్షణం సంభ్రమాశ్చర్యాలు కలుగుతున్నాయి. ప్రతిదీ నోరు వెళ్ల బెట్టే విషయమే- మరో గంటకు ఏమౌతుందోనన్న ఉత్కంఠతో, టెన్షన్‌తో రోజులు గడుపుతున్నాం. ఇదంతా మన దేశ నేతల కరుణా కటాక్షాల వల్ల- సినిమాలను తలదన్నే చిత్రవిచిత్రాలు అన్ని మాధ్యమాలలో చూస్తున్నాం. బహుశా ఏ కాల్పనిక నవలలోనూ ఇన్నిన్ని అద్భుతాలు జరగవేమో.

శాంతి, అహింస, పరమత సహనం ప్రభోదించిన జాతిపిత పుట్టిన రాష్ట్రంలో మానవతకే మచ్చగా మిగిలిన అమానవీయ, మతోన్మాద శక్తుల పదఘట్టనల కరాళ నృత్యాన్ని 'గుజరాత్ ఫైల్స్' కళ్లకు కట్టించింది కదా? ఆ వాస్తవాల్ని వాస్తవాలుగానే బయట పెట్టింది కదా! ప్రఖ్యాత పరిశోధనా జర్నలిస్టు -- తెహల్కా ఉద్యోగి అయిన, రానా ఆయూబ్ రాసిన సంచలనాత్మక పుస్తకం? 'గుజరాత్ ఫైల్స్' కొంత మందయినా చదివి ఉంటారు. పరిశోధన కోసం ఆయన 'మైథిలీ త్యాగి'గా పేరు మార్చుకుని, దాదాపు ఎనిమిది తొమ్మిది నెలల పాటు ఒక ఇండో అమెరికన్ ఫిల్మ్ మేకర్‌గా రూపాంతరం చెంది అండర్ కవర్ ఆపరేషన్ చేసి- బయట పెట్టిన అనేక వాస్తవాలు రుజువులతో సహా ఆయన ఆ పుస్తకంలో భద్రపరిచారు.

నరేంద్ర దామోదర్ దాస్ మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ఆయన అక్కడ జరిపించిన ఎన్నో ఎన్‌కౌంటర్ల గురించిన వాస్తవాలు; సర్కారీ దౌర్జన్యానికి అక్కడి పోలీసు వ్యవస్థ ఎలా భాగస్వామ్యమయ్యింది కళ్లకు కట్టించిందే ఆ పుస్తకం! చైతన్య వంతమైన జీవితం -- అని డబ్బా కొట్టుకున్న గుజరాత్ వెనుక చీకటినీడల జాడ తెలుసుకోవాలంటే ఈ పుస్తకం తప్పక చదవాలి.

నిజానికి ఆ పుస్తకం చదవాలంటే చాలా ధైర్యం కావాలి. సున్నిత మనస్కులు తట్టుకోగలరో లేదో గాని -- అదయితే తప్పక చదవాల్సిన పుస్తకం! కళ్ల ముందే హింస జరుగుతూ ఉంటే, వివశులమై, నిస్సహాయంగా, మనసు కుదుట పరుచుకుని, నిస్తేజంగా చూస్తూ కూర్చున్నట్టుగా ఉంటుంది. నిజంలో, నిజాయితీలో వాస్తవంలో ఇంత గగుర్పాటు ఉంటుందా? అని అనిపిస్తుంది. అందుకే చెప్పేది కల్పనలలో కంటే వాస్తవంలోనే మేజిక్ ఎక్కువ! అందుకే కాబోలు రిచర్డ్ డాకిన్స్ ఎంజు హీూ+×జ రాఖీ =జూూూ× ని సిద్ధాంతీకరిస్తూ మంచి పుస్తకమే రాశాడు.

ఒక దశాబ్ద కాలంగా పాఠకుల అభిరుచి మారిపోయింది. కల్పనా సాహిత్యం, కవిత్వం, వెనకబడ్డాయి. వాస్తవ చిత్రణతో వచ్చే గ్రంథాలు- సైన్సు, చరిత్ర, ఆత్మకథలు, జీవిత చరిత్రలకు ప్రాముఖ్యం పెరిగింది. ఒకప్పుడు డిటెక్టివ్, క్రైమ్ థ్రిల్లర్ నవలలు, సాంఘిక నవలలు కొనుక్కుని చదువుకునేవారు. లేదా గ్రంథాలయాల నుండి తెచ్చుకుని చదివేవారు. ఇప్పుడు ఆ అవసరం లేదు. ఏ వార్తా పత్రిక తిరగేసినా, ఏ టి.వి ముందు కూర్చున్నా, ఇంటర్‌నెట్‌లో ఏ సైట్ తెరచిచూసినా చాలు. బోలెడన్ని అద్భుతాలు.. ఊహకు అందని అశ్చర్యాలు.. గుండె వేగాన్ని పెంచే వాస్తవ కథనాలు! తీరిక చేసుకుని, క్యూలో నిలబడి, టికెట్ కొనుక్కుని ఏ థియేటర్‌లోనో కూర్చోనక్కరలేదు. అద్భుతాలు చూడాలనుకుని, మనల్ని మనం మానసిక సంసిద్ధతతో ఉంచుకుంటే చాలు -- వాస్తవ జగత్తులోనే బోలెడంత మత్తు ఉంది.

ప్రభుత్వమే పని గట్టుకుని దేశపౌరుల్ని మతం మత్తులో, ద్వేషం మత్తులో ముంచుతూ ఉంది. ఇవి కాకుండా మంచినీరే దుర్లభమైపోతోంది గానీ, మాదక ద్రవ్యాలు, లిక్కరూ ప్రభుత్వం ఏరుల్లా పారిస్తోంది. ఇన్ని ఉన్నాక ఇక కల్పనా సాహిత్యం ఎందుకూ? పైగా గత యుగాల కల్పనా సాహిత్యంలోనే నేటి ప్రభుత్వాలు ప్రజల్ని నాన బెడుతున్నాయి. ప్రజలు నాని, నాని, సనాతనానికి విత్తనాలై ఆకలి, ఉపాధి, ప్రగతి లాంటి మాటలు మాట్లాడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ప్రభుత్వం నేర్పించిన దేశభక్తి, హిందూ ముస్లిం -- వంటి మాటలు అంధభక్తులు చిలక పలుకుల్లా వల్లిస్తున్నారు. జైశ్రీరామ్ నినాదంతో అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు.

ఎలాంటి దేశం ఎలా అయిపోయిందన్న ఆందోళన అధికారంలో ఉన్నవారికి లేదు. రోజూ ఆరువందల మంది, ఈ దేశ పౌరసత్వాన్ని వదిలేసి వెళ్లి, విదేశాలలో స్థిరపడుతున్నారన్న బెంగలేదు. దేశరాజధానితో సహా దేశంలో పలు ప్రధాన నగరాల్లో స్వచ్ఛమైన గాలి కూడా పిల్చుకోలేనంత దుర్భరంగా ఉంటే ఆ విషయం మీద పార్లమెంట్‌లో చర్చ జరగదు. ఫాసిస్టు భావజాలంతో నవల రాసిన బంకించంద్ర ఛటర్జీ 'ఆనంద మఠ్' నవలలోని గేయాన్ని తిరగతోడి -- అది అత్యంత ఆవశ్యకరమైన విషయమైనట్టు- పార్లమెంట్‌లో దాన్ని చర్చిస్తారు. ప్రజాధనం ఎలా వృథా చేస్తున్నారోనన్నది మనం ప్రత్యక్ష ప్రసారంలో మన ప్రభుత్వాన్ని చూస్తూ ఉంటేచాలు. చాలా చాలా నేర్చుకోవచ్చు. శరవేగంగా మన సమాజాన్ని అనాగరిక కాలంలోకి బలవంతంగా తోసేస్తున్న ఈ ప్రభుత్వానికి మనం కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఉండాలి. తప్పిస్తే -- విమర్శిస్తే ఇక అంతే సంగతులు!

నీకు పౌరసత్యమే లేదంటారు. లేదా జైల్లోకి నెట్టేస్తారు.. ఈడి, సిబిఐ, కోర్టులు, పత్రికలు, మీడియా అన్నీ ఉండనే ఉన్నాయి. ఇవేవీ భరించలేని వాళ్లు 'సజ్‌నా -- తెరె సంఘ్ సంఘ్..' అని పాడుకుంటూ వారి వాషింగ్ మిషన్‌లో దూరితే సరి! అన్నింటికి అన్నీ ప్రక్షాళనమైపోతాయి. క్లీన్ చీట్ గజదొంగల్లా బయటపడొచ్చు. వాస్తవ జగత్తులోనే అనూహ్యమైన ఆశ్చర్యకరమైన అద్భుతాలు జరుగుతున్నాయి చూడండని చెపుతున్నది అందుకే! రచయితలు రాసే కల్పనా సాహిత్యం ఎందుకు పనికొస్తుందీ? మీకు మనసనేది గనక ఉంటే. అది మిమల్ని బాధ పెడుతూ గనక ఉంటే- ముందు దాన్ని బయటికి లాగి పంపించేయండి. మీ ఆరోగ్యం కుదుటపడుతుంది. జనహర్ లాల్ నెహ్రూ వందేమాతర గీతాన్ని ముక్కలు చేశారు గనకనే భారతదేశం హిందుస్తాన్-పాకిస్తాన్‌లుగా ముక్కలయ్యిందని ఈ దేశ ప్రధాని 2025 డిసెంబర్ 8న లోకసభలో ప్రకటించారు. ఈనగ సత్యాన్ని ఈ దేశ ప్రజలకు ఇంతవరకు తెలియజెప్పిన వారు లేరు కదా? ఈ దేశ ప్రజల మీద గల అవ్యాజమైన ప్రేమతో ప్రధాని చెపితే కదా తెలిసింది?

కల్పనా సాహిత్యం ఎందుకు పనికొస్తుందండీ ? ప్రస్తుత ప్రధాని భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూను ద్వేషిస్తున్నాడని, ఆయన్ని తక్కువగా చేసి మాట్లాడుతున్నాడని సామాన్యజనం అనుకుంటున్నారు. కానీ, విచిత్రమేమంటే మోడీజీకి నెహ్రూజీ పేరు తలవంది తెల్లవారదు. మాటమాటకూ నెహ్రూ పేరెత్తుతున్నాడంటే ఏమనుకోవాలీ? ఆయన నెహ్రూను అభిమానిస్తున్నాడనీ అనుకోవాలి. కావాలంటే చూడండి. ఆపరేషన్ సింధూర్‌ని పురస్కరించుకుని ఉపన్యసించేప్పుడు మోడీ -- నెహ్రూ పేరు పద్నాలుగు సార్లు జపించారు. అలాగే రాజ్యాంగం రూపొందించుకుని డెబ్బయి అయిదేళ్లు అయిన సందర్భంలో ఉపన్యసిస్తూ మోడీ నెహ్రూ పేరు పదిసార్లు స్మరించుకున్నారు. ఇంత కచ్చితంగా ఎలా తెలిసింది. అనే అనుమానమే అక్కరలేదు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సభ్యులు మోడీ స్కోర్ ఎంతయ్యిందో లెక్కగట్టి ప్రకటించారు. ఏ విషయం మీద ఎప్పుడు ఎక్కడ మాట్లాడినా (టెలిప్రాప్టర్‌పై చదివినా) పాపం, మోడీ గారు నెహ్రూను తలుచుకోకుండా ఉపన్యసించలేరు. "జినే హం భూల్‌నా చాహే -- ఓ అక్సర్ యాద్ అతే హై" అనే సినిమా పాట మోడీ మనసులో పాడుకుంటూ ఉంటాడేమో కూడా!

ఆరెస్సెస్, బీజేపీల ఆలోచనల ప్రకారం తొలి ప్రధానిగా నెహ్రూస్థానంలో సర్దార్ పటేల్ రావల్సింది అని అంటుంటారు. తమకు అందిన ఓట్ చోరి బిరుదును నెహ్రూకు బహూకరించి -- "నెహ్రూ ఓట్ చోరీతో ప్రధాని అయ్యాడు"అని చెప్పుకుని సంతృప్తి పడతారు. ఢిల్లీలోని జేఎన్‌యు పేరు మార్చి "జహంగీర్ నేషనల్ యూనివర్సిటీ" అని కేరింతలు కొడతారు. జవహర్‌కు ముస్లిం వారసత్వాన్ని అంటగట్టామని పండగ చేసుకుంటారు. అది వారికొక తుత్తి! నెహ్రూ తన నివాస భవనాన్ని దేశానికి అంకితం చేశారు. ఆనంద నిలయం తర్వాత కాలంలో "జవహర్ లాల్ నెహ్రూ మ్యూజియం" అయ్యింది. నెహ్రూ పేరు వినబడితే ఎలా? అని ఇప్పటి మోడీ ప్రభుత్వం దాన్ని 'ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం'గా మార్చింది. నిజానికి అందులో ఉన్నవన్నీ నెహ్రూజీ వస్తువులే. ఇతర ప్రధాన మంత్రులవి ఎవరివీ ఏమీ లేవు. విమర్శలు రాకుండా ఉండడానికి కనీసం ఫస్ట్ ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం -- అని అయినా అనాల్సింది.

అంధభక్తులకు అంత తెలివి ఎక్కడిది? వయసులో పెద్దవాడయినా పటేల్ స్వయంగా నెహ్రూకు ఉత్తరం రాశాడు. "ఈ దేశానికి మీరు చేసిన త్యాగాల ముందు మేమంతా చిన్నవాళ్లం. ఆదేశిస్తే, దేశాభివృద్ధి కోసం నేను ఏ విభాగంలోనైనా పని చేయగలను" అని రాశాడు. నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రచురించిన పుస్తకంలో పటేల్ ఉత్తరాన్ని కావల్సినవారు చదువుకోవచ్చు.

పటేల్ దృష్టిలో నెహ్రూ మహోన్నతుడు. ఆరెస్సెస్ -- బీజేపీ వారికి చెప్పుకోవడానికి నాయకుడు ఎవరూ లేక, గుజరాత్ వాడయినందుకు పటేల్ గురించి గొప్పగా చెప్పుకుంటారు. హోంమంత్రిగా పటేల్ ఆరెస్సెస్‌ను రెండుసార్లు నిషేధించిన విషయం మాత్రం చెప్పుకోరు. పటేల్ విగ్రహం పెట్టుకున్నారేమో గాని, దేశప్రజల మనసుల్లోంచి నెహ్రూ స్నానాన్ని తగ్గించలేరు. అది వారివల్ల కాదు -- భక్తులు కష్టకాలంలో 'దేవుడా! దేవుడా!' అని అంగలారుస్తారు. తమ భయాన్ని పోగొట్టుకుంటారు.




మోడీ-షాలు, ఆరెస్సెస్, బీజేపీలు ఏ కష్టమొచ్చినా 'నెహ్రూ..నెహ్రూ' అని అంగలారుస్తున్నారు. భయం పోగొట్టుకుంటున్నారు. చెప్పేది ఒకటి చేసేది మరొకటి. దేశ పౌరుల్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తడమంటే ఇదే! వాస్తవంలో మనకు కనిపిస్తున్న మేజిక్లు ఇలాంటి వేనన్నమాట!! అన్నింటికన్నా ఈ ప్రభుత్వం చేస్తున్న పెద్ద మేజిక్ ఏమిటంటే -- చదువు పేరుతో పిల్లల్ని స్కూళ్లలో ఉంచకుండా స్వేచ్ఛగా రోడ్లమీద తిరగమని వది లేసింది.

మహా మహా నాయకుల రాష్ట్రమైన గుజరాత్‌లోనే బడిమానేసిన పిల్లల సంఖ్య గత ఐదేళ్లలో 371 శాతం పెరిగింది. అంటే వారు 2.5లక్షల మంది! ఇక గత ఐదేళ్లలో బడి మానేసిన పిల్లల సంఖ్య దేశంలో 66 లక్షల మంది. ఈ చదువు రాని పాలకులు భావి భారత పౌరుల్ని తమంతటి వారిగా చేయాలని ఉబలాట పడుతున్నట్లుగా ఉంది. ఇలాంటి మేజిక్లు తెలుసుకున్నా ఈ దేశ పౌరులకు ఆనంద భాష్పాలు ఆటోమెటిగ్గా రాలిపోక ఏమవుతాయి?

సింగిడి అమృత్ అమృత్ తెలంగాణ తెలుగు దినపత్రిక ఎడిటర్

## ఎమీ జాక్సన్ కొత్త డేటింగ్ పై ఆగని రూమర్లు



అందాల ఎమీ జాక్సన్ బ్రిటన్ కి చెందిన బిలియనీర్ జార్జి పనాయటౌని పెళ్లాడి ఒక బిడ్డకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. కానీ ఇటీవల ఈ జంటకు బ్రేకప్ అయ్యిందన్న గుసగుసా వినిపిస్తోంది. అంతేకాదు గాసిప్ గర్ల్ స్టార్ ఎడ్ వెస్ట్ విక్ తో ఎమీజాక్సన్ గత కొంతకాలంగా డేటింగ్ చేస్తోందని కథనాలొస్తున్నాయి. ఇటీవలే వెస్ట్ విక్ పుట్టినరోజు వేళ ఇద్దరూ అతని కుటుంబంతో కలిసి సెలబ్రేట్ చేసుకోవడం ఇప్పుడు మరోసారి హాట్ టాపిక్ గా మారింది. ఎడ్ విక్ 35వ పుట్టినరోజు వేడుకల్లో ఎమీజాక్సన్ అతడికి ఎంతో సన్నిహితంగా కనిపించింది. ఈ వీడియోలో ఎడ్ తన పుట్టినరోజు కేక్ ను కట్ చేస్తున్నప్పుడు అమీ అతనితో పాటు నిలబడి కనిపించింది. తన ప్రియమైన వారితో కలిసి వేడుకలో ఎడ్ విక్ నవ్వులు చిందిస్తూ కనిపించాడు. ఎడ్ విక్ తన బర్త్ డే కేక్ కట్ చేసి కొవ్వొత్తులను ఊదుతూ ఈ వీడియోలో కనిపించాడు. ఎడ్- ఎమీజాక్సన్ జంట ఇటీవల రాయల్ అస్కాట్- 2022కి హాజరయ్యారు. ఈ సంవత్సరం ప్రారంభంలో స్పెయిన్ లో విహారయాత్రలో కూడా కనిపించారు. గత డిసెంబర్ లో సౌదీ అరేబియాలోని రెడ్ సీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ లో మొదటిసారిగా ఒకరినొకరు కలుసుకున్నారు. తక్షణమే ప్రేమలో పడ్డారు. ప్రస్తుతం ఆ ఇద్దరి అనుబంధంపైనా మీడియాలో రకరకాల కథనాలు వస్తున్నాయి. అయితే దీనిపై అధికారికంగా ఆ ఇద్దరి నుంచి ఎలాంటి ప్రకటనలు రాలేదు. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ఎమీ జాక్సన్ చివరిగా 2.0 చిత్రంలో కనిపించింది. ఇందులో రజనీకాంత్ – అక్షయ్ కుమార్ కీలక పాత్రల్లో నటించారు. ఎమీ ప్రస్తుతం యునైటెడ్ కింగ్ డమ్ లో నివాసం ఉంటోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో .. తన కొడుకు ఆండ్రియాస్ కొంచెం పెద్దయ్యాక తిరిగి సినిమాల్లోకి రావాలనుకుంటున్నానని .. భారతదేశంలో షూటింగ్ లను మిస్సవుతున్నానని కూడా పేర్కొంది.

## నిలువెత్తు అందగత్తె అదరహో

తెలుగు ప్రేక్షకులకు ఎస్ ఎం ఎస్ సినిమా తో పరిచయం అయిన ముద్దుగుమ్మ రెజీనా. ఈ అమ్మడు తక్కువ సమయంలోనే బ్యాక్ టు బ్యాక్ చిన్నా మీడియం రేంజ్ సినిమాల్లో నటించి మంచి గుర్తింపు ను దక్కించుకుంది. హీరోయిన్ గా తెలుగు తో పాటు ఇతర భాషల్లో కూడా నటిస్తూ దాదాపు పుష్కర కాలంగా ఇండస్ట్రీలో కొనసాగుతున్న రెజీనా ఇప్పటికి కూడా పలు సినిమాల్లో నటిస్తూ ఉంది. ప్రస్తుతం ఈ అమ్మడు నటిస్తున్న పలు సినిమాలు చర్చల దశలో.. కొన్ని షూటింగ్ దశలో ఉన్నాయి. హీరోయిన్ గానే కాకుండా స్పెషల్ సాంగ్ లో కనిపించడం.. ప్రత్యేక పాత్రల్లో కనిపిస్తూ బిజీ బిజీగా ఉన్న ఈ అమ్మడు సోషల్ మీడియాలో ఫోటో షూట్స్ తో కూడా తగ్గేదే లే అన్నట్లుగా అందాల ఆరబోత చేస్తూ కుర్రకారుకు చెమటలు పట్టిస్తోంది. తాజాగా రెజీనా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పెద్ద ఎత్తున అందాల ఆరబోత చేయకున్నా కూడా నిలువెత్తు అందం అనిపించేలా బాటమ్ యాంగిల్ ద్వారా ఈ అమ్మడి అందాల ఆరబోతకు ప్రతి ఒక్కరు ఫిదా అవుతున్నారు. థైస్ ను ఎక్స్ పోజ్ చేస్తూ కొంటగా చూస్తున్న రెజీనా అందం ను చూసి ప్రతి ఒక్కరు కూడా అదరహో అనకుండా ఉండలేరు అన్నట్లుగా కామెంట్స్ వస్తున్నాయి. ఇటీవలే మెగాస్టార్ సినిమా లో ఐటెం సాంగ్ చేసిన ఈ అమ్మడు మరిన్ని ఐటెం సాంగ్స్ ను చేసేందుకు సిద్ధం అన్నట్లుగా ఉంది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ తో అలరించే ముద్దుగుమ్మ రెజీనా స్టార్ హీరోలకు జోడీగా హీరోయిన్ గా నటించే అవకాశాలు మాత్రం ఇప్పటి



వరకు దక్కించుకోలేక పోయింది. ఆ ఆఫర్లు రాకపోవడంతో స్టార్ హీరోయిన్ గా మాత్రం ఈ అమ్మడు గుర్తింపు దక్కించుకోలేక పోయింది.

## వింత వ్యాధి గురించి బయటపెట్టిన హీరోయిన్


సినిమా రంగంలో నటీనటులు పైకి ఎంత స్టార్స్ హోదా తో కనిపించినా కూడా తెర వెనుక వారు కూడా అందరీలనే కొన్ని సమస్యలను తరచుగా ఎదుర్కొంటూ ఉంటారు. కొంతమందికి ఎంత డబ్బులు ఉన్నా కూడా నయం చేయలేని జబ్బులు వారిని ఇబ్బంది పెడుతూనే ఉంటాయి. అలాగే ఇటీవల ఒక హీరోయిన్ తన దీర్ఘకాలిక వ్యాధి గురించి చెప్పుకుని ఎవరు తప్పుగా అర్థం చేసుకోవద్దని ఒక వివరణ అయితే ఇచ్చింది. ఇష్క్ విష్క్' 'ఢిల్లీ బెల్లీ' సినిమాలతో బాలీవుడ్ లో గుర్తింపు పొందిన నటి షెనాజ్ ట్రెజరీ తన వ్యాధి గురించి సోషల్ మీడియాలో పేర్కొంది. ఈ 40 ఏళ్ల నటి ప్రోసోపాగ్నోసియా అనే వ్యాధితో ఇబ్బంది పడుతున్నట్లు చెప్పుకొచ్చింది. అది ఎలాంటి వ్యాధి అంటే ఎవరైనా వ్యక్తిని కొత్తగా కలిసినప్పుడు ఆ తర్వాత మళ్లీ అతన్ని గుర్తుపట్టలేనంతగా ఉంటుంది అని కొన్నిసార్లు తరచుగా కలిసే వ్యక్తిని కూడా చాలా ఈజీగా మర్చిపోతూ ఉంటాను అని ఈ బ్యూటీ తెలియజేసింది. ఇక ఈ వ్యాధి కారణంగా మనుషులను చాలాసార్లు గుర్తుపట్టలేని సమయంలో ఎదుటివారు తనకు పొగరు అని అనుకున్నారు అని కొన్నిసార్లు అయితే మొహం మీదే ఆ విషయాన్ని కూడా చెప్పినట్లుగా తెలియజేసింది. కానీ నా పరిస్థితి గురించి వారికి వివరణ ఇచ్చేవరకు అర్థమయ్యేది కాదని ఈ విషయంలో కొన్నిసార్లు నేను మానసికంగా ఆందోళన కూడా చెందానని షెనాజ్ ట్రెజరీ పేర్కొంది. మొదట నేను ఇలా ఎందుకు జరుగుతుంది అని వైద్యులను అడిగినప్పుడు



కొన్ని పరీక్షలు చేసిన అనంతరం వ్యాధి గురించి బయటపడినట్లుగా ఈ బ్యూటీ తెలియజేసింది. మెదడుకు సంబంధించిన ఈ వ్యాధి కొంతమంది ముఖాలను గుర్తుపట్టలేని విధంగా చేస్తుందని అయితే వారి హెయిర్ స్టైల్ చూసి గుర్తు పట్టే విధంగా మాత్రం అవకాశం ఉంటుంది అని వివరణ ఇచ్చింది. అయితే నెక్స్ట్ టైం వచ్చినప్పుడు ఆ వ్యక్తి తన హెయిర్ స్టైల్ మార్చుకుంటే మాత్రం మళ్ళీ మర్చిపోతాను అని కూడా షెనాజ్ ట్రెజరీ తెలియజేసింది.




## స్విమ్మింగ్ లో షామా సోయగాలు



దాదాపుగా పాతిక సంవత్సరాల క్రితం ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ షామా సికిందర్. హీరోయిన్ గా చేసిన ప్రయత్నాలు విఫలం అవ్వడం తో బుల్లితెరపై కూడా తన అదృష్టం ను పరీక్షించుకుంది. 2003 సంవత్సరంలో యే మేరీ లైఫ్ హై తో సోనీ టీవీ ద్వారా బుల్లి తెర ప్రేక్షకులకు చేరువ అయిన ఈ అమ్మడు తక్కువ సమయంలోనే మంచి పాపులారిటీని దక్కించుకున్నాడు. సోనీ టీవీలో ప్రసారం అయిన ఎన్నో షోలు మరియు సీరియల్స్ లో మెప్పించిన ముద్దుగుమ్మ షామా సికిందర్ ఆకట్టుకునే అందం తో పాటు నటన విషయంలో కూడా విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. నటిగానే కాకుండా మోడల్ గా కూడా సుధీర్ఘమైన కెరీర్ ను కొనసాగించిన ఈ అమ్మడు ముందు ముందు మరింతగా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధం అన్నట్లుగా ఉంది. నాలుగు పదుల వయసులో పడ్డా కూడా షామా సికిందర్ అందాల ఆరబోత ఏమాత్రం తగ్గలేదు. పై పెచ్చు ఈమద్య కాలంలో ఈ అమ్మడి సోషల్ మీడియా ఫోటోలు కుర్రకారులో సైతం హీట్ ను పెంచుతున్నారు. పాతికేళ్ల ముద్దుగుమ్మకు ఏమాత్రం తగ్గకుండా కళ్లు పెద్దవి చేసి మరీ చూసే విధంగా ఈ అమ్మడి అందాల ఆరబోత ఉందంటూ కామెంట్స్ వస్తున్నాయి. తాజాగా స్విమ్మింగ్ పూల్ లో పింక్ బికినీ లో క్లీవేజ్ షో చేస్తూ మతులు పోగొట్టే విధంగా అందాల ప్రదర్శణ చేసిన ఈ అమ్మడి ఫోటోలు వైరల్ అవుతున్నాయి. చాలా రోజులుగా ఈ అమ్మడి హాట్ ఫోటోలు రెగ్యులర్ గా సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309, ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com